

ముంచుకొస్తోంది : కోనసీమ జిల్లా ఓడలరేవులో భారీగా కోతకు గురైన సముద్రతీరం



ముక్కలు..చెక్కలు : ఉప్పాడ వద్ద రోడ్డు కోత

ముప్పు ముంచుకొస్తోంది.. సముద్రతీరం భారీగా కోతకు గురవుతోంది. అలజడి రేపు తోంది..అటు కాకినాడ.. ఇటు కోనసీమ జిల్లాల్లో వేలాది ఎకరాల విలువైన భూములు సముద్రగర్భంలో కలిసిపోతున్నాయి. రహదారులు, సరుగుడు తోటలు, మడ అడవులు కళ్లె దుటే కడలిలో కలిసిపోతూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. సముద్రతీరం వెంబడి అక్రమంగా ఇసుక తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.



కల్లోల..కడలి!

- కడలి కోపాగ్నికి కరుగుతున్న తీరం
- ఉప్పాడలో కోత నివారణకు కసరత్తు
- సీఎం ఆదేశాలతో కేంద్రానికి కలెక్టర్ లేఖ
- రూ.320 కోట్ల నిధులు కోరిన వైనం
- కేంద్రం నుంచి సానుకూల స్పందన
- శాస్త్రవేత్తలతో ప్రత్యేక అధ్యయనం
- కోనసీమలో మునుగుతున్న ఊళ్లు

(కాకినాడ/ అమలాపురం, ఆంధ్రజ్యోతి)

ఏళ్ల తరబడి ఉప్పాడను వేధిస్తోన్న సముద్రపు కోతకు శాశ్వత పరిష్కారం సాధించే దిశగా ప్రభుత్వం అడు గులు ముమ్మరం చేసింది. ఐదేళ్లుగా కోత తీవ్రతతో నష్టం పెరిగినా అప్పటి వైసీపీ సర్కారు పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉప్పా డను సముద్రపు కోత నుంచి కాపాడేందుకు వడివడిగా అడుగులు పడుతు న్నాయి. ఇటీవల కలెక్టర్ల సదస్సులో సముద్రపు కోతపై జరిగిన చర్చలో కోత నివారణకు అవసరమైన నిధులను కేంద్రం నుంచి రాబట్టేలా పర్యవేక్షిం చాలని కలెక్టర్ షాన్ మోహన్‌ను సీఎం ఆదేశించారు. దీంతో ఇటీవల కలెక్టర్ కేంద్రానికి లేఖ రాశారు. రూ.320 కోట్లతో 12 కిలోమీటర్ల మేర కోత నివారణకు ప్రణా ళిక సిద్ధం చేశామని వివరించారు. సీఎం ఆదే శాలతో ఈ ప్రతిపాదనపై జాతీయ విపత్తుల నిర్వహణ సం స్థతో సంప్రదింపులు ఆరంభించింది. నష్ట నివారణ నిధుల విడుదలకు దాదాపు సమ్మతించింది.ఈ తరహా ప్రతిపాదనలు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చినట్టు వివరించింది. ఉప్పాడ కోత తీవ్రత దృష్ట్యా త్వరలో నిధులు విడుదలకు మార్గం సుగమం అ వుతుందని అధికారులు భావిస్తున్నారు.

కోతకు అడ్డుకట్ట ఇలా

డిప్యూటీ సీఎం పవన్ జోక్యంతో కోతను అధ్యయనం చేయడానికి నేషనల్ కోస్టల్ రీసెర్చ్ సెంటర్ (ఎన్‌సీఆర్‌సీ) శాస్త్రవేత్తలు వచ్చి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఉప్పాడ వద్ద దక్షిణం, ఉత్తర దిశల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలో డ్రాఫ్ట్ రూపొందించారు. ప్రధానంగా ఉప్పాడ వద్ద సముద్రం అలల తీవ్రత చాలా అధికంగా ఉన్నట్టు తేల్చారు.దానిని తగ్గించ గలిగితే కోత బాగా నెమ్మదిస్తుందని అంచనా వేశారు. ఉప్పాడ వద్ద తీరం నుంచి 170 మీటర్ల లోపు సముద్రంలో అత్యంత బలంగా కాంక్రీట్‌తో నిలువునా గోడ నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి టెట్రాపాడ్‌లు కలపనున్నారు.టెట్రాపాడ్‌లు మూడు కాళ్ల ఆకారంలో కాంక్రీట్ దిమ్మల్లా చాలా బలంగా ఉంటాయి.వీటిని కాంక్రీట్ గోడపై అమర్చుతారు. ఆపైన మళ్లీ భారీ రాళ్లు పేర్చుతారు. దీనివల్ల ఉప్పాడ వైపు అలల తీవ్రత దాదాపుగా తగ్గి కోత నెమ్మది స్తుంది. ఉప్పాడకు దక్షిణం వైపు కాకినాడ నుంచి వచ్చే దారిలో మలుపు వద్ద సముద్రం పూర్తిగా ముందుకు వచ్చేసింది.ఈ నేపథ్యంలో ఇక్కడ కొత్త బీచ్ సృష్టించాలని ప్రతిపాదించారు. శాస్త్రవేత్తలు పరిష్కారం కనుగొన్నారు. ఉప్పాడకు సమీపంలో కాకినాడ డీప్‌వాటర్ పోర్టు ఉంది. నేరుగా భారీ నౌకలు ఈ పోర్టుకు వస్తాయి.నౌకలు వచ్చే మార్గంలో ఏటా ఇసుక డ్రెడ్జింగ్ చేసి నౌకా మార్గానికి ఇబ్బంది లేకుండా చేస్తారు. డ్రెడ్జింగ్ చేసిన సమయంలో వచ్చే ఇసుకను ఉప్పాడ దక్షిణం వైపు పోసి కొత్త బీచ్ సృష్టించాలని తేల్చారు. ఏడాదికి 50 లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున, రెండేళ్లకు కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకను తెచ్చి ఇక్కడ డంప్ చేయాలని నిర్ణయించారు.ఇలా 12 కిలోమీటర్ల మేర కోత నివారణ చర్యలు చేపట్టడానికి రూ.320 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

20 ఏళ్లుగా ముందుకు..

కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద సముద్రం 20 ఏళ్లుగా భారీగా ముందుకు వచ్చేసింది. తుఫాన్లు, అల్పపీడనం సమయాల్లో తీరం అల్లకల్లోలంగా మారుతోంది. కోత వల్ల ఏకంగా 1,360 ఎకరాలు, రెండు ఆలయాలు, 150 వరకు ఇళ్లు సముద్ర గర్భంలో కలిసిపోయాయి.అధికారంలోకి వస్తే కోత నివారణకు శాశ్వత చర్యలు చేపడ తామని ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చింది.దీనికి తగ్గట్లుగా అడుగులు వేస్తుంది.

కోనసీమకూ.. గుండెకోత

కోనసీమలో సముద్రతీరం తీవ్రంగా కోతకు గురవుతోంది. వందల ఎకరాల భూములు కడలిలో కలిసిపోతున్నాయి. కోనసీమ జిల్లా 8 మండలాల పరిధిలో 48 కి.మీ. మేర తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఒక వైపు ఇసుక మాఫియా ప్రతినిదులు తీరాన్ని తవ్వేస్తుంటే మరో వైపు సముద్రం ముందుకు దూసుకొస్తూ ఊళ్లను ముంచెత్తుతోంది. భైరవపాలెంలోని సముద్రతీర ప్రాంతం నుంచి బ్రహ్మసమేధ్యం, చిర్రయానాం, ఎస్.యానాం, వాసాలతిప్ప, కొమరిగిరిపట్నం,ఓడలరేవు, కేశనపల్లి, కరవాక, చింతలమోరి, అంతర్వేది తీరం వరకు సముద్రం భారీగా కోతకు గురవుతోంది. భవిష్యత్‌లో ఆందోళనకరమైన పరిణామాలకు కారణంగా నిపుణులు భావిస్తున్నారు. ఓడలరేవు తీరప్రాంతంలో వేలాది కోట్ల విలువైన చమురు సంపదను తరలించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఓఎన్జీసీ ప్లాంటుకు సంబంధించి భారీ నిర్మాణాలకు చేరువగా సము ద్రం ముందుకొచ్చింది. ఇటీవల తీరం అల్లకల్లోలం కావడంతో గతంలో ఓ కాంట్రాక్టు సంస్థ నిర్మించిన రక్షణ గోడ ఇప్పుడు చిధ్రమై ప్లాంటు గోడ కూడా కోతకు గురయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. దీంతో ఓఎన్జీసీ అధికారులు ప్రత్యేక కార్యాచరణకు రంగం సిద్ధం చేస్తున్నారు. రూ.110 కోట్ల అంచనా వ్యయంతో సముద్రం వెంబడి పటిష్టమైన, అత్యాధునికమైన టెక్నాలజీతో కూడిన గోడను నిర్మించుకునేందుకు త్వరలోనే ఆ సంస్థ అధికారులు టెండర్లు పిలుస్తారని ఇక్కడ ప్రచారం జరుగుతోంది. కాగా ఓడలరేవు సముద్ర బీచ్ రిసార్ట్స్‌కు కూడా రాగల రోజుల్లో ముప్పు పొంచి ఉందని భావిస్తున్నారు.

కోనసీమకు.. హైపర్ టెన్షన్

- ప్రభుత్వ ఆరోగ్య సర్వేలో అగ్రస్థానం
- పది రకాల వ్యాధులపై పరిశీలన
- టెన్షన్‌లోనే కోనసీమకు స్థానం



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎందుకో.. నిత్యం కోనసీమ వాసులు విపరీతమైన టెన్షన్‌కు గురవుతారు. ప్రతి చిన్న విషయానికి టెన్షన్‌కు గురికావడంవల్ల అనారోగ్య సమస్యలకు తరచూ గురికావడమే కాదు ఎన్నో అనర్థాలకు కారణం కూడా అవుతున్నారు. సంయమనం కోల్పోయి ఆవేశావేశాలకు లోనై విచక్షణ కోల్పోవడంవల్ల ఇక్కడ ఎన్నో వివాదాలు, ఘర్షణలతోపాటు ఆత్మన్యూనతా భావంతో ఒత్తిళ్లకు లోనై ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల వ్యాధులకు మూలాలు, వాటి వెనుక ఉన్న కారణాలను అన్వేషించేందుకు ప్రభుత్వం ఇటీవల ఒక సర్వే నిర్వహించింది. గుండె, కిడ్నీ, శ్వాస సంబంధిత వ్యాధులతోపాటు డయాబెటీస్, కేన్సర్ వంటి రోగాలు ఏ ప్రాంతంలో నమోదు అవుతున్నాయో పరిశోధనలు చేశారు. ఆయా జిల్లాల్లో ప్రజల ఆహారపు అలవాట్లు, జీవన విధానంపై వ్యాధుల ప్రభావం చూపుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని పదిరకాల వ్యాధులపై అధ్యయనం చేశారు. వీటిని స్క్రీనింగ్ చేయగా కొన్ని జిల్లాల్లో వివిధ రకాల వ్యాధులు ప్రభావం చూపగా మరికొన్ని జిల్లాల్లో తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాత్రం హైపర్ టెన్షన్‌లో అగ్రగామిగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 18ఏళ్ల వయసు కన్నా ఎక్కువ ఉన్న 2.15కోట్ల మందికి స్క్రీనింగ్ చేస్తే అందులో 9.2శాతం మంది అంటే 19.78లక్షల మంది హైపర్ టెన్షన్‌కు గురవుతున్నట్టు నిర్ధారణ అయింది. వీరిలో మగవారి కన్నా మహిళలే హైపర్ టెన్షన్ ఎదుర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11.40 లక్షలమంది మహిళలు హైపర్ టెన్షన్ ఎదుర్కొంటుంటే, 8.37లక్షల మంది మగవారు ఉన్నారు. జిల్లాలవారీగా చూస్తే హైపర్ టెన్షన్‌లో కోనసీమ జిల్లాయే అగ్రగామిగా ఉంది. ఆ తర్వాత కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ ప్రభావం ఉన్నట్టు నిర్ధారించారు.

ఏ వ్యాధిగ్రస్తులు ఎందరంటే..

కోనసీమ జిల్లాలో 1,15,401 హైపర్ టెన్షన్‌కు గురవుతున్నారు. డయాబెటీస్‌కు గురైన వారు 47,892మంది, హైపర్ టెన్షన్, డయాబెటీస్‌కు గురయ్యేవారి సంఖ్య 1,06,258మంది, న్యూరాలజీ సమస్యలకు గురయ్యేవారి సంఖ్య 3760, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడేవారి సంఖ్య 5594మంది. ఇలా వివిధ రకాల అనారోగ్య సమస్యలతో గురైన వారిని ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు, జీవన విధానం మార్చుకోవడం ద్వారా రోగాల బారిన పడే అవకాశాన్ని తగ్గించుకోవచ్చుననే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహించిన ఈ సర్వే ప్రధాన లక్ష్యం. దీనిపై మరింత అధ్యయనం, పరిశీలన, పరిశోధన జరగాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం పేర్కొంది.

జనసేన నేతల మధ్య భగ్గుమన్న విభేదాలు

- జనసేన నాయకుడిపై అయినవిల్లి మండలాధ్యక్షుడి హత్యాయత్నం
- ఇరు వర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసిన పోలీసులు

7

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 300 అర్జీలు

అమలాపురంటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నూటిగా పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ముఖ్యమంత్రికార్యాలయం నుంచి వారానికి మూడుసార్లు పీజీఆర్ఎస్ కార్యక్రమాలపై జిల్లా నోడల్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారంప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కలెక్టర్‌తోపాటు జేసీ నిషాంతి, డీఆర్వో రాజకుమారి, డీఆర్డీఏ పీడీ సాయినాథ్ జయచంద్ర గాంధీ, డ్వామా పీడీ మధుసూదన్, ఎస్‌డీసీ కృష్ణమూర్తి ప్రజలనుంచి 300 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 25అర్జీలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలోనిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 25 అర్జీలను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు స్వీకరించారు. అర్జీదారుల నుంచి రాత పూర్వక ఫిర్యాదులను స్వీకరించి వారితో ముఖాముఖీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సమ్మతమైనవైతే త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

సేంద్రీయ వ్యవసాయంతో.. ఆరోగ్య భద్రత : జేసీ

అమలాపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సహజ సేంద్రీయ వ్యవసాయంతోనే భూసార సంరక్షణ, ఆరోగ్య భద్రత చేకూరుతుందని జేసీ టి.నిషాంతి అన్నారు. మానవాళి మనుగడకు సహజ సేంద్రీయసాగు భరోసాగా నిలుస్తుందన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, రైతుసాధికారిత మున్సిపల్, స్వచ్ఛంద సంస్థలు, రైతుబజార్, దేవదాయశాఖ అధికారులతో సేంద్రియ ఉత్పత్తుల సాగు, మార్కెటింగ్‌పై జేసీ సమీక్ష నిర్వహించారు. అనారోగ్య సమస్యలకు పరిష్కార మార్గంగా సహజ వ్యవసాయ పద్ధతులద్వారా పంటలను పండించాలన్నారు. టెర్రస్ గార్డెన్‌లను ప్రోత్సహించి కంపోస్టు ఎరువులతో కూరగాయలను పండించాలన్నారు. వీటిని ప్రోత్సహించే దిశగా రిసోర్స్‌పర్సన్లు కృషి చేయాలన్నారు. ప్రకృతి సహజ ఉత్పత్తులైన పంటలను రైతుబజార్లలోవిక్రయించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, మార్కెటింగ్ అధికారి జి కె.విశాలాక్షి, దేవదాయశాఖ సహాయక మిషనర్ వి.సత్యనారాయణ, రైతు సాధికార సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, కృషీవల సంస్థ ప్రతినిధి అడ్డాల గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.



ఆక్వాకు కష్టం

- విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించే ఆక్వాపై ప్రభుత్వాల నిర్లక్ష్యం
- అమెరికాకు సముద్ర ఉత్పత్తుల్లో ఏపీ అగ్రస్థానం
- 27శాతం ట్రంప్ సుంకం ప్రభావం
- దిగుమతి సుంకం రైతులపై మోపడం ఎంతవరకు సమంజసం
- నిలదీస్తున్న ఆక్వారైతులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

భారతదేశం నుంచి సముద్ర ఉత్పత్తులు అగ్రరాజ్యం అమెరికాతోపాటు చైనా వంటి దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడంలో కీలకంగా మారాయి. ఈ తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి దిగుమతి చేసుకునే సముద్ర ఉత్పత్తులపై 27శాతం సుంకాన్ని విధించారు. దీంతో ఏపీలో ఉన్న ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేసే కంపెనీలు ఆ సుంకం పేరుతో ఆక్వా రైతులపై ఆ భారాన్ని మోపుతూ తీసుకుంటున్న నిర్ణయాలు ఆక్వారైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఎక్కడినుంచో ఎగుమతి అయ్యే ఉత్పత్తులను అమెరికా దిగుమతి చేసుకుంటే వాటిపై విధించే సుంకంభారాన్ని తమపై మోపడం ఎంతవరకు సమంజసమంటూ ఆక్వారైతులు ప్రశ్నిస్తున్నారు.

సాగులో ఎన్నో సవాళ్లు

రొయ్యల సాగు, ఎగుమతుల్లో భారతదేశం అగ్రగామిగా ఉన్నప్పటికీ ఎక్స్‌పోర్టర్స్ సిండికేట్‌గా మారి ధరల తగ్గించి కొనుగోలు చేస్తున్న తీరుతో రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటున్నారు. ఆక్వా పంట కాలంలో గణనీయమైన సవాళ్లు ఎదుర్కొంటున్నారు. వేసవిలో పంటసాగు కోసం జనవరిలో స్టాకింగ్ ప్రారంభిస్తారు. ఏప్రిల్, మే నెలల చివరిలో పంటకు సిద్ధమవుతారు. ఈ సమయంలోనే ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకు రొయ్యల ధరలు తీవ్రంగా తగ్గిపోతున్నాయి. ఈ ధరల తగ్గుదల రైతులు పండించే ఉత్పత్తి రేటులో తగ్గుదల కంటే చాలా దారుణంగా ఉంటోంది. దీంతో రైతులు తీవ్రమైన ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆక్వా రైతులకు లాభాలపరంగా చూస్తే వేసవిలో వచ్చే పంటే కీలకమైనది. ఈ సమయంలోనే ధరలు స్పెక్యులేషన్‌వల్ల రైతులు నిలదొక్కుకోలేని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. గతంలో రొయ్యల ఫీడ్‌పై కేంద్రం విధించిన సుంకాన్ని తగ్గించినా ఆ ప్రతిఫలం రైతులకు అందడం లేదనేని ఆక్వారైతుల అసోసియేషన్ నాయకుడు చెయ్యేరుకు చెందిన తవటపల్లి నాగభూషణం ఆరోపిస్తున్నారు. విద్యుత్ ధరలపై సబ్సిడీని వర్తింపచేయకపో వడం, జోన్లపేరుతో విభజించి ఆక్వాసేద్యాన్ని విచ్ఛిన్నం చేయడం, నాణ్యమైన రొయ్య పిల్లల ఉత్పత్తి చేయకపోవడం, పెరుగుతున్న లీజులు, పెట్టుబడి వ్యయంపై నియంత్రణ లేకపోవడం వంటి కారణాలతో ఆక్వా సేద్యం కుదేలవుతుందని అభిప్రాయపడ్డారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తమ ఇబ్బందులపై అధ్యయనం చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆక్వా రైతులు కోరుతున్నారు.

రొయ్యల ఎగుమతిలో ఘనత

భారతదేశం నుంచి ప్రపంచంలో ఉన్న 132 దేశాలకు సముద్ర ఉత్పత్తులు ఎగుమతి అవుతుంటాయి. 2023-24లో అమెరికాకు సముద్ర ఉత్పత్తుల ప్రధాన దిగుమతిదారుగా భారత్ వ్యవహరించింది. అంటే 34.53శాతం వాటా కలిగి ఉంది. 3,29,192 మెట్రికల్ టన్నుల సముద్ర ఉత్పత్తులను దిగుమతి చేసింది. దీనిమొత్తం విలువ 2,548.15 మిలియన్ డాలర్లుగా పేర్కొంటున్నారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో పండించే ఆక్వా ఉత్పత్తుల్లో ఫ్రోజెన్ శ్రింప్, వనామీ శ్రింప్, బ్లాక్ టైగర్ శ్రింప్, స్కాంపీ వంటి రొయ్యలను అమెరికాకు ఎగుమతి చేసిన ఘనతలో చరిత్రకెక్కింది. ఏపీ నుంచి సముద్ర ఉత్పత్తుల ఎగుమతికి విశాఖ పోర్టు కీలక భూమిక వహించింది. ట్రంప్ విధించిన దిగుమతి సుంకాన్ని రైతులపై కిలోకు రూ.30 నుంచి రూ.40 భారంతో కొనుగోళ్లు నిలిచి ఆక్వా రైతులు అందోళన జఠిలమైంది.

ఎస్సీ యువత స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ నిరుద్యోగ యువతకు వివిధ స్వయం ఉపాధి పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకురాలు జె.సత్యవతి తెలిపారు. రూ.2.50లక్షలనుంచి రూ.20లక్షలవిలువైన వివిధ రకాల యూనిట్లను ఇందుకోసం సిద్ధం చేశారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 1043 యూనిట్లను మంజూరు చేశారని తెలిపారు. ఆ యూనిట్లకు మొత్తం రూ.43.51కోట్లు కేటాయించగా ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.17.18 కోట్లు అందిస్తుందని రూ.24.16కోట్లు బ్యాంకురుణంగా అందిస్తుందన్నారు. లబ్ధిదారులు తమ వాటాగా రూ.2.17కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. స్వయం ఉపాధి పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందించాలన్నారు. ఈనెల 14న అంబేడ్కర్‌జయంతిని పురస్కరించుకుని దరఖాస్తులను సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారని, మే 10వతేదీలోగా దరఖాస్తులు అందించాలన్నారు. వివరాలకు మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులను సంప్రదించాలని కోరారు.

అన్నదాతకు ఆసరాగా డ్రోన్ టెక్నాలజీ

- తొలిసారిగా పైలెట్ ప్రాజెక్టుగా కోనసీమ జిల్లా ఎంపిక
- సాంకేతిక ప్రతినిధుల ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభం: కలెక్టర్

అమలాపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీపై తొలిసారిగా కోనసీమ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి శిక్షణ కార్యక్రమాలకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. అన్నదాతకు ఆసరాగా డ్రోన్ టెక్నాలజీ నిలుస్తుందన్నారు. వ్యవసాయ సాగుకు ఆధునిక సాంకేతికతను జోడిస్తూ చేపట్టిన డ్రోన్ టెక్నాలజీతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అభ్యుదయ రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, వ్యవసాయ డిగ్రీ పొందిన విద్యార్థులను మూడు కేటగిరీలుగా విభజించి 134మందికి కర్నూలు ట్రిపుల్ ఐటీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ సాంకేతిక ప్రతినిధి కృష్ణనాయక్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల బృందం ఈనెల 7నుంచి 11 వరకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇస్తారన్నారు. తొలుత శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు మరింత సులువుగా చేపట్టేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు.మండలానికి ఆరుగురు చొప్పున ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. ముందుగా వ్యవసాయసాగు క్షేత్రాలను ఆశించిన క్రిమి,కీటకాలను డ్రోన్లు, ఫ్లయింగ్ కెమెరాల ద్వారా గుర్తించి విశ్లేషిస్తామన్నారు. వాటి నివారణకు డ్రోన్ల ద్వారా సులభతరంగా పురుగు మందులను పిచికారీ చేస్తామన్నారు. ఎకరా పొలంలో క్రిమిసంహారక మందులు, ఎరువుల పిచికారీకి రూ.2వేలు ఖర్చవుతుందని,డ్రోన్ల ద్వారా డబ్బు ఆదాఅవుతుందని వివరించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. డ్రోన్ పైలెట్ లైసెన్సులు జారీ చేస్తామన్నారు. ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.1.80లక్షలు ఉంటుందన్నారు. తొలుత అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో డ్రోన్లఫ్లయింగ్ విధానాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. డీఆర్డీఏ పీడీ సాయినాత్ జయచంద్రగాంధీ మాట్లాడుతూ తొలిదశలో 8డ్రోన్లను జిల్లా సమాఖ్య నిధులనుంచి కొనుగోలు చేస్తామన్నారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో శిక్షణ పొందిన డ్వాక్రా సంఘాల ప్రతినిధులతో వీటిని రైతులు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. శిక్షణలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డీపీఎం గణపతి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అమలాపురంలో వైభవంగా వేంకటేశుని దివ్యకల్యాణం

అమలాపురంలో వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. అలివేలుమంగ తాయారు, బీబీ నాంచారి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఉదయం 8.58 గంటలకు భక్తుల గోవిందనామస్మరణల నడుమ స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జేసీ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి తదితరులు కల్యాణోత్సవాన్ని తిలకించారు.



అలివేలు మంగతాయారు, బీబీ నాంచారి సమేత వేంకటేశ్వరస్వామి



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్



స్వామివారి దివ్య కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

వెంకన్న క్షేత్రం.. కల్యాణ సంబరం

- వాడపల్లి వెంకన్న దివ్యకల్యాణ మహోత్సవాలు ప్రారంభం
- ధ్వజారోహణంతో అంకురార్పణ
- నేడు తీర్థం, కల్యాణం

7



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

వెంకన్న క్షేత్రం.. కల్యాణ సంబరం



ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ

- వాడపల్లి వెంకన్న దివ్యకల్యాణ మహోత్సవాలు ప్రారంభం
- ధ్వజారోహణంతో అంకురార్పణ
- నేడు తీర్థం, రథోత్సవం, కల్యాణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం



పిండి ముగ్గుతో స్వామి చిత్రం

కడియం బుర్రిలంకకు చెందిన రూప అనే భక్తురాలు సోమవారం పిండి ముగ్గుతో శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రం గీసి ఆకట్టుకుంది.

ఆత్రేయపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యకల్యాణ మహోత్సవాలు దశమి సోమవారం నుంచి ఘనంగా ప్రారంభయ్యాయి. వేకువజామునే మేల్కొపు, నిత్యబలిహరణ, బాలభోగ నివేదన, నిరాజన మంత్రపుష్పం అనంతరం భక్తులకు దర్శనాలు, సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, దీక్షాధారణ, వాస్తు పూజ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణంతో కార్యక్రమాలను నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేద పడింతులు ధ్వజపతాకం ఎగురవేసి కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఏకాదశి మంగళవారం స్వామివారిని మేల్కొపి భక్తులకు దర్శనాలు అందిస్తారు. మధ్యాహ్నం ఎదుర్కొలు ఉత్సవం నిర్వహించి వేలాది మంది భక్తుల నడుమ రథోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి శ్రీనివాస ప్రాంగణంలోని సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదిక వద్ద జగత్ కల్యాణార్థం స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావులు కలిసి కల్యాణ వేదిక, పుష్కరఘాట్లు, రథోత్సవం నిర్వహించే మాడవీధులు, భక్తుల సౌకర్యాలపై పరిశీలించి చర్చించారు. వివిధ డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు వస్తున్న దృష్ట్యా పార్కింగ్ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు.

విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణలు

శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదికను వివిధ రకాల పుష్పాలతో అలంకరించే పనిలో నిపుణులు నిమగ్నమయ్యారు. 10వేల మంది వీఐపీలు, భక్తులు, ప్రముఖులు, స్వామివారి కల్యాణం తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రావులపాలెం నుంచి బొబ్బర్లంక, లొల్ల నుంచి వాడపల్లి వరకూ స్వాగత ద్వారాలు, ఎల్ఈడీ విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంతో పాటు మాడవీధులు దేవతామూర్తులతో పాటు విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఫలపుష్పాలతో స్వామివారి ఆలయాన్ని అలంకరించారు.



యనమల రాజకీయ ప్రస్థానంపై పుస్తకం

10న తునిలో పుస్తకావిష్కరణకు ఏర్పాట్లు

ముఖ్య అతిథులుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత



తునిలో కూటమి నాయకులతో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజా అశోక్‌బాబు

తుని రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): యనమల రామకృష్ణుడు రాజకీయ జీవితంపై '42వ వసంతాల యనమల రాజకీయ ప్రస్థానం' పేరుతో పుస్తకం ప్రచురించారు. ఈనెల 10న కాకినాడ జిల్లా తునిలో ఈ పుస్తకావిష్కరణ, ఆత్మీయ సన్మాన వేడుకను అట్టహాసంగా నిర్వహించేందుకు కూటమి శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా తునిలో మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత రాజా అశోక్‌బాబు పార్టీ శ్రేణులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 42 ఏళ్ల యనమల రాజకీయ ప్రస్థానంలో ఆయన మచ్చలేని నాయకుడిగా వెలుగొందారని, ఇది రాజకీయాల్లో అద్భుత ఘట్టమని అన్నారు. సుదీర్ఘ రాజకీయాల్లో యనమల స్పీకర్‌గా, పలుమార్లు మంత్రిగా, ఎమ్మెల్యేగా పదవులను అలంకరించి ఆ పదవులకే వన్నె తెచ్చేలా స్ఫూర్తిదాయకమైన పాలన అందించారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలకమైన వ్యక్తిగా గొప్ప వ్యక్తిత్వం ఉన్న తుని ప్రాంతవాసి అయిన ఆయనను ఈ నెల 10న తునిలో సత్కరించుకునే అవకాశం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత విచ్చేయనున్నారని తెలిపారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు కూడా హాజరుకానున్నారన్నారు. కూటమి పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొచ్చెర్లపాటి రూపాదేవి, మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ తుని పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, మాజీ కౌన్సిల ర్లు మళ్ల గణేష్, జల్లు వాసు, కుక్కడుపు బాలాజీ, టీడీపీ నాయకులు తమరాన సత్యనారాయణ, ఆవుగడ్డి వెంకటరమణ, తమరాన రామకృష్ణ, కోడా వెంకటరమణ పాల్గొన్నారు.

'ఉమ్మడి తూర్పు'లో
జడ్జీల బదిలీలు

రాజమహేంద్రవరం/కాకినాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు న్యాయమూర్తులు బదిలీ అయ్యారు. ఐదో అదనపు జిల్లా జడ్జి డి.విజయ్‌గౌతమ్ 12వ అదనపు జిల్లా జడ్జిగా విశాఖపట్నం, పిఠా పురం 12వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎ.వా సంతి నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జిగా.. కాకినాడలో మూడో అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న పి.కమలాదేవి కర్నూలు ఒకటో అదనపు జిల్లా జడ్జిగా.. అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేశ్ అనకాపల్లి పదో అదనపు జిల్లా జడ్జిగా.. కాకినాడ ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత ఆర్.వోరా నెల్లూరు ఫ్యామిలీ కమ్ ఆరో అదనపు జిల్లా జడ్జిగా, రాజమహేంద్ర వరంలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు జడ్జి ఆర్.శ్రీలత మదనపల్లె ఏడో అడిషనల్ జి ల్లా జడ్జిగా, ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు న్యాయ మూర్తి పీవీఎస్ సూర్యనారా యణమూర్తి మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జిగా, రామచంద్రాపురం అదనపు జిల్లా జడ్జి ఎం.శంకరరావు చిత్తూరు పోక్సో కోర్టు జడ్జిగా, అనంతపురం జిల్లా గూటిలోని 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరిని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

జనసేన నేతల మధ్య భగ్గుమన్న విభేదాలు

- జనసేన నాయకుడిపై అయినవిల్లి మండలాధ్యక్షుడు హత్యాయత్నం
- మండలాధ్యక్షుడు కారు ధ్వంసం చేసిన వ్యతిరేక వర్గీయులు
- ఇరు వర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసిన అయినవిల్లి పోలీసులు





పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ప్రశ్నిస్తున్న ఉమా వర్గీయులు

అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోలేటి ఉమా

అమలాపురం/అయినవిల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న పి.గన్నవరం ఎస్సీ రిజర్వు నియోజకవర్గ పరిధిలోని అయినవిల్లి జనసేన నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. జనసేన నాయకుడిపై మండలాధ్యక్షుడు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి తాలూకా బంధువులు మండలాధ్యక్షుడి వాహనాన్ని ధ్వంసం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. క్షతగాత్రుడిని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఏరియా ఆసుపత్రిలో పరామర్శించడానికి వచ్చినప్పుడు బాధితుడి బంధువులు ఎమ్మెల్యేపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం కోనసీమ జిల్లా పి.గన్నవరం మండల జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మార్కెట్ కమిటీ వ్యవహారంపై ఇద్దరు నాయకుల మధ్య వచ్చిన విబేధాలు ఇందుకు కారణంగా భావిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అయినవిల్లికి చెందిన జనసేన నాయకుడు తోలేటి ఉమా ఇంటిపై మండలాధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్ తన అనుచరులతో కలిసి వెళ్లి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఉమా, అతని భార్యపై రాజేష్‌తో పాటు మరికొందరు దాడి చేసి ఉమాను తీవ్రంగా గాయపరిచారు. ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో అడ్డువచ్చిన అతని భార్యపై కూడా దాడికి తెగబడ్డారు. తలపై బలమైన గాయం తగిలిన ఉమాను అమలాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తోలేటి ఉమాపై దాడి చేసిన పోలిశెట్టి రాజేష్ ఇంటిపైకి ఉమా వర్గీయులు ఎదురు దాడికి వెళ్లి బయట ఉన్న రాజేష్ కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ వ్యవహారం మండలంలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. అయితే గాయపడ్డ తోలేటి ఉమాను పరామర్శించేందుకు సోమవారం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఏరియా ఆసుపత్రికి వచ్చిన క్రమంలో ఆయనతో ఉన్న కొందరు నాయకులు మీడియాపై తీవ్రమైన ఆంక్షలు విధిస్తూ వీడియోలు తీయకుండా అడ్డుకున్నారు. పరామర్శ అనంతరం బయటికి వచ్చిన ఎమ్మెల్యే సత్యనారాయణను బాధితుడైన ఉమా వర్గం నాయకులు నిలదీశారు. పార్టీ మండలాధ్యక్షుడై ఉండి ఈ విధంగా దాడులకు పాల్పడ్డగా ఏం చర్యలు తీసుకుంటారంటూ గట్టిగా నిలదీశారు. దాంతో ఈ వివాదంపై జనసేన పార్టీ అధిష్టానానికి నివేదిస్తూ లేఖ రాస్తానని, ఇది మా కుటుంబ సమస్య చర్చించి పరిష్కరించుకుంటామంటూ సమాధానమిచ్చారు. అయితే ఈ వివాదంపై అయినవిల్లి పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించి కేసులు నమోదు చేశారు. దీనిలో భాగంగా బాధితుడైన ఉమా భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యర్థి వర్గానికి చెందిన జనసేన పార్టీ మండలాధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, అబ్బిరెడ్డి యుగంధర్, పోలిశెట్టి రవి, మరో ఇద్దరిపై సెక్షన్ 329 (4), 109 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదేవిధంగా రాజేష్ కారు ధ్వంసానికి సంబంధించి రాజేష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 361(6), 329(3), రెడ్ విత్ 35 సెక్షన్ కింద అయినవిల్లి పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన సంతకాలు ఆటోగ్రాఫ్‌గా మారాలి

ఉన్నత లక్ష్యాలతోనే దేశాభివృద్ధి : విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ



నన్నయ విశ్వవిద్యాలయంలో లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నన్నయ వీసీ, అధికారులు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మనల్ని చూసి గర్వపడడం, చదువుకున్న విద్యాసంస్థకు ముఖ్యఅతిథులుగా రావడం, మన సంతకాలు ఆటోగ్రాఫ్‌లుగా మారడం వంటి మూడు విషయాలను యువత లక్ష్యాలుగా నిర్దేశించుకోవాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఇటువంటి లక్ష్యాలతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం జాతి నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి యువత మొబైల్‌ఫోన్‌లతో బిజీగా ఉన్నారని రీల్స్‌షాట్స్ చూస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని, మద్యం నాన్న రక్తం, ధూమపానం అమ్మ ఊపిరి తాగుతున్నాం అని గుర్తు చేసుకోవాలన్నారు. మన స్నేహితులు మంచి వారై ఉండాలని తద్వారా మనం ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్నారు. మహనీయుల చరిత్రను చదువుకోవాలని చెప్పారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ యువత ఒక దేశ బలం, పురోగతికి మూలస్తంభాలుగా ఉంటారన్నారు. సమాజంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకురావడంలో యువత గణనీయమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. బలమైన నైపుణ్యంగల యువత భారత దేశ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వారి పాత్రను వివరించారు.

బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి



మృతిచెందిన శివ

పెద్దాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మం డలం వాలుతిమ్మాపురం రహదారిలో ఉన్న ఓ రైస్ మిల్లులో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయవాడ నగరానికి చెందిన వేముల శివ (29) ఫ్యాక్టరీకి పని మీద వచ్చి ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయాడు. ఇంతలో బాయిలర్ నుంచి విడుదలైన వేడి నీటి కారణంగా మృతిచెందినట్టు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై సీఐ విజయశంకర్ ఆదేశాలతో ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మాంసం వ్యాపారికి తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో మాంసం వ్యాపారి తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు కు చెందిన పిల్లి అప్పారావు సోమవారం మేకలు కొనుగోలు చేసేందుకు చేబ్రోలు మోటార్‌సైకిల్‌పై వెళ్తు న్నాడు. పట్టణ శివారులోని రైసుమిల్లు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో అప్పారావుకు తీవ్రగాయాలై అ పస్మారక స్థితికి చేరుకున్నాడు. తొలుత పిఠాపురం, అక్కడ నుంచి కాకినాడలోని ప్రవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోకి స్కూలు వ్యాన్ బోల్తా

ఏడుగురు విద్యార్థులు, డ్రైవర్‌కు గాయాలు



కాలువలోకి దూసుకుపోయి బోల్తాపడిన వ్యాన్

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారులో కాలువలోకి స్కూలు వ్యాన్ బోల్తా పడి ఏడుగురు విద్యార్థులు, డ్రైవర్ గాయపడ్డారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులోని ఒక ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన స్కూలు మినీ వ్యాన్ చెందుర్తిలో పది మంది విద్యార్థులను ఎక్కించుకుని బయల్దేరింది. చెందుర్తి శివారులోకి వచ్చేసరిగా ఎదురుగా వస్తున్న లారీ మీదకు రావడంతో మినీవేన్‌ను డ్రైవర్ తప్పించబోయాడు. అదుపు తప్పడంతో కాలువలోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జి.హర్షిత, అపర్ణ, సిద్ధు, ధరణి, కె.భార్గవ్, హాసిని, నిహారికలకు గాయాలయ్యాయి. డ్రైవర్‌కు కాళ్లు విరిగాయి. పాఠశాల యజమాన్య ప్రతినిధులు వారిని చికిత్స నిమిత్తం పిఠాపురంలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. ఒక విద్యార్థిని మాత్రం కాలువలో నీరు ఎక్కువగా తాగడంతో అస్వస్థతకు గురైంది. క్షతగాత్రులను పిఠాపురం సీఐ శ్రీనివాస్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు అక్కడికి చేరుకుని తమ వారికి ఏమైందోనని ఆందోళనకు గురయ్యారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

నేటి నుంచి కాకినాడలో
ఇండో-అమెరికా సైనిక విన్యాసాలు

130 మంది పోలీసులతో బందోబస్తు

ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్‌డీపీవో

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో ఈ నెల 8 నుంచి 13 వరకు జరిగే ఇండో-అమెరికా సైనిక విన్యాసాల టైగర్ ట్రయాంఫ్-25 కోసం 130 మంది పోలీసులతో కట్టుదిట్టమైన పటిష్ఠ భద్రతా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్టు కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన సూర్యారావుపేట బీచ్‌లో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ లు, ఏఎస్ఐలు, హెచ్‌సీ, పీసీలతో బందోబస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. సైనిక విన్యాసాలు జరిగే రోజుల్లో మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు నిషేధిత ప్రాంతాల్లోకి రాకూడదన్నారు. మంగళవారం నుంచి 13వ తేదీ వరకు లైట్‌హౌస్ నుంచి ఉప్పాడ వరకు ఎటు వంటి వాహనాలకు ప్రవేశం లేదన్నారు. సైనిక విన్యాసాల్లో పూర్తి అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆయన ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లు, ఇరుదేశాల త్రివిధ దళాల అధికారులు, సిబ్బందికి వసతి, ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం సైనిక విన్యాసాలు జరిగే నావెల్ ఎన్‌క్లేవ్ పరిసర ప్రదేశాలను పరిశీలించారు. తిమ్మాపురం ఎస్ఐ, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత పాల్గొన్నారు.



సూర్యారావుపేట బీచ్‌లో బందోబస్తు ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, సీఐ చైతన్యకృష్ణ

21.6 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

రాజానగరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న 3 వాహనాలను రాజానగరం సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ గొలుగూరి బాపిరాజు సోమవారం దాడి చేసి పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారిపై రాజానగరం పరిధిలోని జీఎస్ఎల్ సమీపంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా 3 వాహనాలను ఏక కాలంలో పట్టుకుని సీజ్ చేశామన్నారు. గొల్లప్రోలుకు చెందిన ఆకుల స్వామి డ్రైవర్‌గా ఉన్న ఏపీ 39-యు.బి 1314 వాహనంలో 15,390 కిలోల బియ్యం, పెద్దాపురం మండలం గోరంట్ల గ్రామానికి చెందిన కోరుకొండ అచ్చిరాజు డ్రైవర్‌గా ఉన్న ఏపీ 39 యు.ఏ 6550 నంబరు గల వాహనంలో 3,670 కిలోలు, కోనబాలరాజు డ్రైవర్ ఉన్న ఏపీ39-యు.ఐ 5549 నెంబరు కలిగిన వాహనంలో 2,540 కిలోల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్టు పేర్కొన్నారు. పౌరసరఫరాలుశాఖ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం కోర్టులో నిత్యావసర వస్తువుల చట్టం కింద బియ్యం, డ్రైవర్లతో పాటుగా వాహన యజమానులపై సెక్షన్ 6ఏ కేసు నమోదు చేసి రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.9,93,600, వాహనాల విలువ రూ.20 లక్షలు కలిపి మొత్తం విలువ రూ.29,93,600గా నిర్ధారించామన్నారు.



రేషన్ బియ్యంతో స్వాధీనం చేసుకున్న వాహనాలు

గంజాయితో వ్యక్తి అరెస్టు

21 కిలోల స్వాధీనం : డీఎస్పీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

బిక్కవోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామం తూర్పు శివారు జగనన్న కాలనీ వద్ద సీతారామచెరువు వద్ద అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన మరుకుర్తి సూర్యప్రకాష్‌ను 21 కిలోల గంజాయితో ఎస్ఐ అరెస్ట్ చేసినట్టు రాజమహేంద్రవరం డీఎస్పీ బి.విద్య తెలిపారు. సోమవారం రాత్రి ఆమె బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు తెలిపారు. సూర్యప్రకాష్ పదో తరగతి వరకూ చదివి మానేసి అతడి బావతో కలసి చికెన్ షాపు నిర్వహించేవాడు. ఆపై అతడితో గొడవ పడి అల్లూరి సీతారామరాజు జిల్లా కె.పెదబయలు గ్రామానికి చెందిన వంతల పంతులుబాబుతో కలిసి ఎక్కువ డబ్బులు సంపాదించాలనుకున్నాడు. వారిద్దరూ జి.మాడుగుల చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని కొని వాటిని ఎక్కువ ధరకు అమ్మి వచ్చిన సొమ్మును సమానంగా పంచుకునేవారు. ఆ తర్వాత ప్రకాష్ కాకినాడ జిల్లా ఉప్పాడలో చికెన్ సెంటర్‌లో పనికి చేరాడు. అదే సమయంలో అతడికి పాత నేరస్తుడైన స్నేహితులు ఆవాల మణికంఠ, తోలుం రాజు పరిచయమయ్యారు. ముగ్గురూ కలిసి మోటార్‌సైకిళ్ల దొంగతనాలు చేద్దామనుకుని మార్చి మొదటివారంలో బిక్కవోలులో రెండు బైక్‌లు దొంగతనం చేశారు. వాటిలో ఒక దానిని ప్రకాష్.. పంతులుబాబుకు ఇచ్చి దానికి బదులుగా సుమారు 21 కిలోల గంజాయిని తీసుకున్నాడు. ఆపై బిక్కవోలు గ్రామం శివారుకు వచ్చి స్నేహితులైన మణికంఠ, రాజు కోసం వేచి చూస్తుండగా సమాచారం మేరకు ఎస్ఐ రవిచంద్ర కుమార్ అరెస్టు చేశారని, పంతులుబాబు పరారీలో డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ సుమంత్,ఎస్ఐ రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

లారీల లింక్.. డేంజర్ బ్లింక్..

మరమ్మతులకు గురైన లారీ ముందు భాగాన్ని మరో లారీకి కట్టి తీసుకెళ్తున్న దృశ్యం కాకినాడ జిల్లా బెండపూడి నుంచి రాజమహేంద్రవరం వైపు నేషనల్ హైవేపై కనిపించింది. అయితే ఏమాత్రం ఆ లారీల లింక్ తెగినా వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు.

-ఫొటోగ్రాఫర్, కాకినాడ



అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

క్రీడలపై యువత మక్కువ చూపాలి

అంబాజీపేట,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి):క్రీడల పట్ల యువత మక్కువ చూపాలని సర్పంచ్ జల్లి బాలరాజు అన్నారు. పుల్లేటికుర్రులో బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలు పురస్కరించుకుని సోమవారం భీమసేన ప్రీమియర్ క్రికెట్ పోటీలను సోమవార సర్పంచ్ ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం

పి.గన్నవరం,మార్చి7(ఆంధ్రజ్యోతి):లంకలగన్నవరంలో శ్రీభూసమేత వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాత్రి స్వామి,అమ్మవార్లకు ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, మారుతి ఆచార్యులు బ్రహ్మత్వంలో యర్రంశెట్టి వెంకటరమణ, అనంతలక్ష్మి దంపతులు కర్తలుగా కల్యాణం నిర్వహించారు.

వైభవంగా వేంకటేశుని దివ్యకల్యాణం



శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణం జరిపిస్తున్న వేద పురోహితులు



కూచిపూడి నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసిన మంత్రి సుభాష్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్చారణలు.. మంగళవాయిద్యాలు.. భక్తుల గోవిందనామస్మరణల నడుమ అమలాపురం వేంకటేశ్వరస్వామివారి దివ్య కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. సుదర్శనం మురళీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు, పురోహితులు శ్రీఅలివేలుమంగ తాయారు, బీబీ నాంచారి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. కల్యాణకర్తలుగా యిండుగుల శ్రీనివాసరావు-పద్మావతి, యిండుగుల వీరభద్రరావు-నాగరాధాకృష్ణకుమారి, శివరామసూర్యవరప్రసాద్-శాంతాదేవి దంపతులు వ్యవహరించారు. ఉదయం 8.58 గంటలకు భక్తుల గోవిందనామస్మరణల నడుమ స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండుగగా జరిపించారు. నల్లా బాబ్జి-అమ్మాజీ దంపతులు, యిండుగుల శ్రీనివాసరావు, మన్యం ప్రదీప్ తదితరులు అందించిన మంచి ముత్యాలతో స్వామి-అమ్మవార్లకు తలంబ్రాలు పోశారు. కల్యాణ క్రతువును భక్తులంతా వీక్షించే విధంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, గంధం పల్లంరాజు, నల్లా స్వామి తదితరులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయివెంకన్న, సభ్యులు కొమ్ముల ఆదినారాయణ, కుంచే వెంకన్నబాబు తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. రాత్రి స్వామివారిని గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు..

నల్లా హైమావతి బృందం, శ్రీదత్తసాయి చిల్డ్రన్స్ వారిచే స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన శ్రీలక్ష్మీశ్రీనివాసా కూచిపూడి నృత్యాలయం విద్యార్థినులతో కసిరెడ్డి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో, అమలాపురం శ్రీకళాక్షేత్ర విద్యార్థినులతో ఏర్పాటుచేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదివో అల్లదివో శ్రీహరివాసము.. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే.. అంటూ సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో లింగోలు పండు, కోనేటి కార్తీక, రాజులపూడి భీముడు, ఆశెట్టి ఆదిబాబు, యేడిద శ్రీను, బోనం సత్యవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం..

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం దేవస్థానం ప్రాంగణంలో తీర్థం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3.15గంటలకు స్వామివారి రథోత్సవం జరుగుతుంది. గారడీలు, భజాభజంత్రీలు, కేరళ వాయిద్యాలతో అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయివెంకన్న తెలిపారు.

న్యాయం చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసనలు

సమస్యలపై వినతిపత్రాలు అందజేత

అమలాపురం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు అర్జీలు వెల్లువెత్తాయి. మండల స్థాయి నుంచి డివిజన్, జిల్లాస్థాయి వరకు వారం వారం ఈకార్యక్రమం నిర్వహిస్తున్నా అర్జీదారులు మాత్రం మండుటెండలను సైతం లెక్కచేయకుండా కలెక్టరేట్‌లో అర్జీలు అందిస్తున్నారు. మండలస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదన్న భావన పలువురు వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల జరుగుతున్న నష్టాలను వివరిస్తూ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అర్జీ అందించారు. 1988నుంచి కోనసీమ తీర ప్రాంతంలో చమురు, గ్యాస్ అన్వేషణ కార్యకలాపాలు నిర్వహిస్తుండడంతో పర్యావరణం పూర్తిస్థాయిలో దెబ్బతిందన్నారు. భూగర్భ జలాలు ఉప్పునీటి కయ్యలుగా మారిపోయాయని, పంటకాల్వలు సైతం డ్రైనేజీలుగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి సూచనల మేరకు గ్రీన్‌బెల్టు మెరుగుపరిచి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.

మద్యం షాపును తొలగించాలి .. మాచవరం గ్రామస్తుల నిరసన



మహిళలకు రక్షణ లేనివిధంగా ఏర్పాటుచేసిన మద్యం షాపును తక్షణం తొలగించాలని డిమాండ్‌చేస్తూ సీపీఎం జిల్లాశాఖ ఆధ్వర్యంలో అంబాజీపేట మండలం మాచవరం గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మద్యం షాపును తొలగించకుండా ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి అర్జీ అందించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, గుదే దుర్గాప్రసాద్, నూకలబలరామ్, టి.నాగవరలక్ష్మి, పచ్చిమాల శివ, కుసుమ నాగమణి, అయితాబత్తుల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల చెరువులు వద్దు.. కందికుప్ప నవబుద్ధనగర్ కాలనీవాసులు



జనావాసాల మధ్య రొయ్యల చెరువుల తవ్వకాలను నిలుపుదల చేయాలని, గతంలో తవ్విన చెరువుల వల్ల కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. రొయ్యల చెరువుల్లోని వ్యర్థాలతో పాటు కెమికల్స్ పంటకాల్వలోకి విడిచి పెట్టడం వల్ల పాడి పశువులు ఆ నీటిని తాగి ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసాల మధ్యే రాజకీయ నాయకుల అండదండలతో రొయ్యల చెరువులు తవ్వేందుకు రాగా కాలనీవాసులంతా అడ్డుకున్నామన్నారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే రొయ్యల సాగు వద్దు బాబోయ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాశి ఆనంద్, చల్లగళ్ల రవికుమార్, జగడం మధు పాల్గొన్నారు.

పచ్చని పొలాలను ఆక్వాజోన్‌లోకి తెస్తారా వానపల్లిపాలెం గ్రామస్తుల నిరసన

పచ్చని పంట పొలాలను ఆక్వాజోన్‌లోకి తీసుకురావడాన్ని నిరసిస్తూ ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెం గ్రామానికి చెందిన వివిధ కాలనీల ప్రజలు కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. ఆక్వా చెరువులు వద్దు భూములను సాగు చేసుకుంటాం. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే ఆక్వా చెరువులు వద్దు అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. వ్యవసాయ భూముల చుట్టూ ఇళ్లు ఉన్నప్పటికీ ఆక్వా చెరువులు తవ్వేస్తారా అని మండిపడ్డారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బొంతు చిట్టిబాబు, వల్లూరి బులివెర్రియ్య, బొంతు రామకృష్ణ పాల్గొన్నారు.



రోడ్డు ధ్వంసంతో ఇండస్ట్రీ మూత..

వేగి వెంకటసత్యవతి, ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్త అవార్డు గ్రహీత, పెదపట్నంలంక



సాయిలక్ష్మి క్వాయర్ ఇండస్ట్రీ ఏర్పాటుతో 30మందికి ఉపాధి కల్పించడంతో పాటు పరిశ్రమను అభివృద్ధి పథంలో నడుపుతుండడంతో గత నెల 8న కలెక్టర్ చేతులమీదుగా సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డును అందుకున్నా. గత నెల 31న కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా రోడ్డు మార్గాన్ని తవ్వేశారు. తరతరాలుగా ఉన్న రోడ్డుమార్గాన్ని ధ్వంసం చేయడాన్ని అడ్డుకుంటే చంపేస్తామని బెదిరించారు. అప్పటి నుంచి క్వాయర్ ఇండస్ట్రీలో తయారైన సరుకు బయటకు, ముడి సరుకు లోనికి వచ్చే దారి లేక 30మంది ఉపాధిని కోల్పోయారు. బ్యాంకు రుణాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు మార్గాన్ని తవ్వేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుని రోడ్డు మార్గాన్ని పునరుద్ధరించి క్వాయర్ ఇండస్ట్రీ తిరిగి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు అర్జీ అందించారు.

విద్యామిత్ర కిట్ల స్టాక్ పాయింట్ల పాఠశాలల పరిశీలన



బండారులంక జడ్పీ ఉన్నత పాఠశాల గదులను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ గనీ

అమలాపురం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను అందించే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని సమగ్రశిక్ష రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ గనీ పేర్కొన్నారు. విద్యార్థిమిత్ర కిట్లను మండల స్టాక్ పాయింట్లలో ఉంచేందుకు అనువైన పాఠశాలలను సోమవారం ఆయన పరిశీలించారు. దీనిలో భాగంగా బండారులంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, అద్భుతమైన ఏకరూప దుస్తులు, బ్యాగులు, బూట్లు, డిక్షనరీలు, నోటు పుస్తకాలు అందిస్తామన్నారు. వాటన్నింటినీ మండలస్థాయిలో ఒక పాఠశాలలో భద్రపరిచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సామగ్రిని భద్రపరిచేందుకు, ఆయా మండలాల్లోని పాఠశాలల విద్యార్థులకు క్షేత్రస్థాయిలో వాటిని పంపిణీ చేసేందుకు జిల్లాస్థాయి, మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభించే నాటికి విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అబ్దుల్ గనీ పేర్కొన్నారు. ఆయన వెంట సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారి సరెళ్ల దుర్గాదేవి, మిస్‌కోర్డినేటర్ రెహ్మాన్, సీఆర్పీలు మెండి శ్రీనుబాబు, అనూష పాల్గొన్నారు.

విద్యా కిట్ల పంపిణీకి చర్యలు

అల్లవరం ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరంలో పాఠశాలల పునఃప్రారంభానికి ముందే రాధాకృష్ణ విద్యార్థి మిత్రలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాకిట్లు మంజూరు చేస్తామని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకుడు షేక్‌అబ్దుల్‌గనీ తెలిపారు. సోమవారం అల్లవరం మండలం జడ్పీ హైస్కూలు స్టాక్ పాయింట్‌ను సందర్శించి కిట్లు భద్రపరిచే గదులను జిల్లా సమగ్రశిక్ష సీఈవో బీవీవీ సుబ్రహ్మణ్యంతో కలిసి గనీ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల ఏకరూపదుస్తులు, షూ, బెల్టు, బ్యాగు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ పాఠశాలల ప్రారంభంలోనే విద్యార్థులకు అందజేస్తారన్నారు. మండల విద్యాధికారి-2 ఎస్.ఏడుకొండలు, హెచ్ఎం ఎన్.వెంకటేశ్వరరావు, సీఆర్ఎంపీలు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి కిట్లు అందించేలా చర్యలు

అంబాజీపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందించే విద్యా కిట్లు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర-1 రాష్ట్రపరిశీలకుడు షేక్ అబ్దుల్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఎంఈవోలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ ఆధ్వర్యంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, షూ, బ్యాగ్ తదితర వాటిని అందించాలన్నారు. తర్వాత రికార్డులను తనిఖీ చేశారు. సీఎంవో బీవీ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతిపై కొవ్వొత్తుల ర్యాలీ

మలికిపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల అకాల మరణాన్ని చింతిస్తూ పడమటిపాలెంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. పడమటిపాలెం క్రైస్తవ సంఘాలు పాల్గొన్నాయి.

'వితంతు పింఛన్ ఇప్పించండి మహాప్రభో'



మామిడికుదురు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తమకు వితంతు పింఛన్ ఇప్పించండి మహాప్రభో అంటూ పాశర్లపూడి గ్రామానికి చెందిన ఎనిమిది మంది వితంతు మహిళలు వేడుకుంటున్నారు. తాము పింఛన్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తన భర్త 2007లో మరణించినప్పటికీ ఇప్పటివరకు తనకు పింఛన్ మంజూరు కాలేదని గ్రామానికి చెందిన ఈతకోట వెంకటలక్ష్మి వాపోయింది. కారణాలు చెప్పకుండా పింఛన్ ఇవ్వడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్ కోసం సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించినట్లు ఆమె తెలిపింది. కార్యక్రమంలో మేడా పైడమ్మ, అంకాని కాసులమ్మ, మందపాటి సత్యవతి, నేదునూరి ప్రభావతి, ఈతకోట వెంకటలక్ష్మి, అంగాని నాగమణి, దిగుమర్తి పెద్దింట్లు, పిల్లి బేబిసరస్వతి ఉన్నారు.

కనకాయలంకలో రూ.22 కోట్లతో వంతెన



కనకాయలంకలో వంతెన డిజైన్‌ను పరిశీలిస్తున్న సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ సీఈ విజయభాస్కర్

పి.గన్నవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గోదావరికి ఎర్రనీరు వచ్చిందంటే చాలు పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేపై రాకపోకలు నిలిచిపోతాయి. అలాగే వరద సమయంలో ఆప్రాంత లంక గ్రామస్తులు నానావస్థలు పడుతున్నారు. కనకాయలంక గ్రామం పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం పాలకొల్లు నియోజకవర్గంలో ఉండటంతో వంతెనపై ఆ నియోజకవర్గ ప్రతినిధి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారు. రూ.22కోట్లతో కాజ్‌వే స్థానే వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం కనకాయలంక గ్రామాన్ని మంత్రి సందర్శించి వంతెనపై అధికారులకు పలు సూచనలు చేశారు. దీంతో సోమవారం సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైషన్ (సీడీవో) సీఈ ఆళ్ల విజయభాస్కర్, అధికారుల బృందం, రాజోలు హెడ్‌వర్క్స్ సబ్‌డివిజన్ డీఈ గంగుమళ్ల శ్రీనివాస్ వంతెన నిర్మాణ ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. చాకలిపాలెం ఏటిగట్టు నుంచి కనకాయలంక గ్రామ సరిహద్దులో సీసీ రోడ్డుకు వంతెనను అనుసంధానం చేస్తామని అధికారులు తెలిపారు. ఏటిగట్టు నుంచి 350 మీటర్ల పొడవు, 3.05మీటర్ల వెడల్పుతో వంతెన ఉంటుందన్నారు. వాటిలో 290మీటర్లు 20పిల్లర్లతో వంతెన, 60మీటర్ల మేర అప్రోచ్ ఉంటుందని వారు తెలిపారు. తొలుత స్థానిక అధికారులతో క్షేత్రస్థాయిలో వంతెన డిజైన్‌ను పరిశీలన చేసి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. సీఈ వెంట సీడీవో ఈఈ సత్యనారాయణ, ఏఈఈ రమేష్, నరసాపురం జేఈ సుబ్బారావు, స్థానిక జేఈలు మూర్తి, నాయుడు తదితరులు ఉన్నారు.

బుచ్చిబాబు పరామర్శ

కాట్రేనికోన, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన రామాలయం వీధిలో రిటైర్డ్ డీఎస్పీ విత్తనాల అర్జునరావు భార్య మంగాయమ్మ ఇటీవల మృతి చెందగా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సోమవారం అర్జునరావు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో దాట్ల పవన్, పీఎస్ రాజు, బండారు ఏసు, వాసంశెట్టి రాజేశ్వరరావు, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కె.రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి రథోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని పలు వీధుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. రథం ప్రవేశించే ప్రాంతాల్లో ఉదయం 9నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రధానంగా వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంతం, పుల్లయ్యరామాలయం సెంటర్, గాంధీబజార్, మాచిరాజువీధి, గండువీధి, నల్లావీధి, రవణంవీధి, గారపాటివీధి, వెత్సావారి అగ్రహారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శ్రీరామపట్టాభిషేకం

అమలాపురంటౌన్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీకామాక్షీపీఠంలో సోమవారం శ్రీరామపట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. పీఠాధిపతి కామేశమహర్షి ఆధ్వర్యంలో బాలబ్రహ్మచారి విఘనస రాజీప్రేమ్ బృందంతో పూజ్యం నాగేశ్వరశర్మ యాజ్ఞికంలో రాజమహేంద్రవరానికి చెందిన కోళ్లపర్తి శివరామారావు-సత్యశ్రీ దంపతులతో శ్రీసీతారామ మహాసామ్రాజ్యపట్టాభిషేకం నిర్వహించారు. భక్తులు పట్టాభిషేకం తలంబ్రాలు తీసుకుని కామేశ మహర్షి ఆశీర్వచనాలు పొందారు. యజ్ఞపూర్ణాహుతి, అన్నసమారాధన జరిగింది.

యల్లాప్రగడకు భారతరత్న ఇవ్వాలి

ఐ.పోలవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాస్త్ర దిగ్గజం యల్లాప్రగడ సుబ్బారావుకు భారతరత్న ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు. ప్రపంచ ఆరోగ్యదినాన్ని పురస్కరించుకుని ప్రజ్ఞాసాహితి ఆధ్వర్యంలో గుత్తెనదీవి సాయిరాం విద్యానికేతన్ హైస్కూల్ వద్ద మూడు రోజులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పుల్లెపు ట్రస్టు ఆధ్వర్యంలో జి.వేమవరానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు ఆకుల సత్తిబాబు, ఐ.పోలవరానికి చెందిన గాలిదేవర మూర్తులను వైద్యరత్న అవార్డులతో సన్మానించారు. కార్యక్రమంలో పుల్లెపు వెంకటేశ్వరరావు, విద్యానికేతన్ కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావు, నాటి ధనరాజు, బొత్తుల శారద, బొమ్మిడి నాగేంద్రవర్మ, ప్రిన్సిపాల్ మాదాపూర్ సీతారత్నం, దుగుదుర్తి వీరలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు పి.వెంకటలక్ష్మి, బీవీవీ సత్యనారాయణమ్మ, ఎం.వెంకటలక్ష్మి, డి.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం

అయినవిల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): యలకల్లంక గ్రామంలోని శ్రీశంకర నారాయణ స్వామి బ్రహ్మసూత్ర స్వరూప శివలింగ కుంభాభిషేకం వైభవంగా జరిగింది. సోమవారం స్వామివారి మంగళదీక్ష, మహాకుంభాభిషేకం, గణపతిపూజ, గవ్యాంత మార్జనలు, విశేష పంచామృత కుంభాభిషేకం, శాంతి హోమం, రుద్ర హోమం, మూల మంత్ర హోమాలు, శాంతి కల్యాణం, మహాపూర్ణాహుతి, అగ్ని ఉద్వాసన, అగ్ని ప్రదక్షిణ, సార్వజన మంత్ర పుష్పాలు, స్వామివారి మంత్రపుష్పాలు, స్వామివారి దివ్య దర్శనం, అన్నసమారాధన నిర్వహించారు. మంజేరు గురూజీ దొరబాబు, బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి గౌరీశంకర్‌కుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాకర శ్రీనివాస్, సలాది పుల్లయ్యనాయుడు, మతుకుమిల్లి బాబూరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

11న కలెక్టరేట్ ఎదుట బీసీ కులాల సమరభేరి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీసీ కులాల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధించగలమని బీఎస్పీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు పేర్కొన్నారు. ఈనెల11న మహాత్మాజ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ ఎదుట బీసీ కులాల సమరభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బండారులంక కందులపాడు కాలనీలో సమరభేరి పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. జనాభాలో 52శాతం మంది ఉన్న బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ కులగణన జరపాలన్న ప్రధాన డిమాండ్లతో చేపట్టిన సమరభేరిలో బీసీలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుడుపూడి శోభారాణి, పిప్పర మంజుల, దూనబోయిన దుర్గ, మామిడిశెట్టి పద్మ, మట్టపర్తి లక్ష్మీదుర్గ, పిచ్చిక జ్ఞానేశ్వరి, పంపన దుర్గాదేవి, పుత్సల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నల్ల తాచు హల్‌చల్

ముమ్మిడివరం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో కాశివానితూము సెంటర్‌లోని ఓ కిరాణా షాపులో ఆదివారం రాత్రి నల్లతాచు హల్‌చల్ చేసింది. మూడు రోజులుగా షాపులో పాము తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేయడంతో షాపు యజమాని యర్రంశెట్టి లక్ష్మణరావు స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. ఆదివారం రాత్రి స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ పామును సీసాలో బంధించాడు.

దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ముమ్మిడివరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం శ్రీషిర్డిసాయిబాబా ఆలయం వద్ద లెండీబాగ్‌లో డాక్టర్ స్వర్గీయ నేమాని వీరవెంకటసత్యనారాయణమూర్తి, సూర్యకాంతం దంపతుల ఆర్థిక సాయంతో నిర్మించిన శ్రీదత్తసాయి నిత్యాన్నప్రసాద నిలయంలో శ్రీగురు దత్తాత్రేయ స్వామి విగ్రహాన్ని సోమవారం ఉదయం 7.30 గంటలకు డాక్టర్ నేమాని జగన్మోహన్-సబిత దంపతులు ప్రతిష్ఠించారు. పండితులు ముక్కవిల్లి సాయిఫణికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ ఉదయం పూజా కార్యక్రమాలు జరిగాయి. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దత్తాత్రేయస్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అలాగే సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా సోమ, మంగళ, బుధ వారాల్లో వేడుకలు జరపనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గుద్దటి రాజేంద్రప్రసాద్ తెలిపారు.

రావులమ్మతల్లి జాతర మహోత్సవాలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడి గ్రామదేవత శ్రీరావులమ్మతల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. గణపతి పూజ, చండీ హోమం, కుంకుమపూజ వంటి కార్యక్రమాలనునిర్వహించారు. రావులమ్మతల్లిని గత నెలలో నెలకొల్పి జాతర మహోత్సవాలు ప్రారంభించారు. సోమవారం రాత్రి భారీ బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు, కోయ డ్యాన్సులతో అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం జరిగే అమ్మవారి తీర్థంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

పంట కాలువ నుంచి నీటి చౌర్యం

యానాం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):యానాంలో నీటిచౌర్యం వెలుగులోకి వచ్చింది. యానాం శివారు ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి ఉందని పలువురు గ్రామస్తులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వాటిని పరిశీలించేందుకు కాంగ్రెస్ బృందం వెళ్లింది. దీంతో ఈఅంశం వెలుగులోకి వచ్చింది. కాలువలో నీరు ఉన్నా చివరి ప్రాంతాలకు ఎందుకు రావడం లేదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థాని దినేష్ కాలువలను పరిశీలించారు. ఈనేపథ్యంలో దొమ్మేటిపేట సమీపంలో కాలువ నుంచి రొయ్యల చెరువులకు నీరు తరలిస్తున్న అంశాన్ని గుర్తించారు. ఎవరికి కనిపించకుండా మోటార్‌పై ఆకులువేసి కప్పివేసి గుట్టుచప్పుడు కాకుండా నీటిని తరలిస్తున్నాడని వారు ఆరోపించారు. ఈవ్యవహారంలో స్థానిక ప్రజాపనుల శాఖ సిబ్బంది ప్రమేయం లేకుండా నీటిచౌర్యం సాధ్యం కాదని, తక్షణం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, శివారు ప్రాంతాలకు మంచినీటిని అందించాలని ఉన్నతాధికారులను కోరారు.

ఉపాధి కూలీ మృతి



ఉప్పలగుప్తం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సన్నవిల్లిలో సోమవారం ఉపాధి హామీ పనులు జరుగుతుండగా మహిళా కూలీ తొత్తరమూడి కాంతమ్మ(59) మృతి చెందింది. తొత్తరమూడి కాంతమ్మ పని ప్రదేశంలో కుప్పకూలింది. వెంటనే ఆమెను సర్పంచ్ చిక్కం జంగమయ్య ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్ కాశి శ్రీరామ్ అమలాపురం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కాంతమ్మ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈసీ ఎం.వీరబాబు, టీఏ కె.బాలరాజు ఆసుపత్రికి వెళ్లి వివరాలు ప్రకటించారు.

కార్యదర్శులకు సన్మానం

అల్లవరం ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చేసిన సేవల ద్వారా ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. తాడికోన, గోడితిప్ప గ్రేడ్-5 కార్యదర్శులుగా పనిచేస్తున్న వీరబాబు, రవిరాజాలు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా ఏజెన్సీకి బదిలీ అయిన సందర్భంగా ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో వీరిని సత్కరించారు. ఏవో బి.లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రాజమోహన్, చిక్కం శ్రీనివాస్, ప్రసాద్, పి.సత్యనారాయణ, సాయిబాబు, మానే కనకమ్మ, మల్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఏపీవోగా రాజామణి

అల్లవరం ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండల ఉపాధిహామీ ఏపీవోగా రాజామణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీవోగా పనిచేసిన వి.శ్రీనుబాబు అమలాపురం బదిలీ అయ్యారు. రాజామణి మర్యాదపూర్వకంగా ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్‌ను కలిశారు.

హైస్కూల్‌కు సీతారామరాజు విరాళం

అల్లవరం ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం న్యాపతి సుబ్బారావుపంతులు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మౌలిక సదుపాయాల కల్పనకు సీనియర్ పాత్రికేయుడు నడింపల్లి సీతారామరాజు రూ.లక్ష చెక్కును అందజేశారు. పాఠశాల గ్రంథాలయాన్ని దత్తత తీసుకుని రూ.2లక్షలతో అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, సీఎంసీ చైర్మన్ సుంకర వాసు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ టెర్మినల్ పనులు స్తంభింపచేస్తాం

అల్లవరం ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 40ఏళ్లుగా ఓఎన్జీసీ చమురు నిక్షేపాలు తరలిస్తూ ఓడలరేవు గ్రామాభివృద్ధి పట్ల నిర్లక్ష్యానికి నిరసనగా మంగళవారం నుంచి ఓఎన్జీసీ టెర్మినల్ ప్లాంటు పనులను అడ్డుకుంటామని గ్రామస్తులు హెచ్చరించారు. ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద 36వ రోజు సోమవారం రిలే దీక్షలు కొనసాగించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. రిలే దీక్షలో కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, కామాడి గంగాభవానీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

కాట్రేనికోన, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన పంచాయతీ మార్కెట్ ప్రాంతంలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సోమవారం పరిశీలించారు. పనులకు సంబంధించిన వివరాలను ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సుబ్రహ్మణ్వేశ్వర, కనకదుర్గమ్మ ఆలయాల వద్ద నీరు నిలిచే అవకాశం ఉన్నందున ఆ ప్రాంతాన్ని మెరక చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దాట్ల పవన్, పీఏస్ఎన్ రాజు, రవివర్మ, వాసంశెట్టి రాజేశ్వరరావు, కడలి సత్యనారాయణ, కముజు రాంబాబు, కముజు సర్వేష్, వెంట్రు సుధీర్ పాల్గొన్నారు.

27 నుంచి సర్వపృష్టపోప్రార్యామ యాగం

అంబాజీపేట, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీతీరాన ఉన్న తొండవరం శ్రీఉమా తొండేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల27 నుంచి లోకకల్యాణార్థం సర్వపృష్టపోప్రార్యామ యాగం నిర్వహిస్తున్నట్టు యాగ నిర్వహణ కమిటీ నిర్వాహకులు ఆకెళ్ళ సూర్యనారాయణ అవధాని (మేఘనాథ్) తెలిపారు. వెయ్యి ఇటుకలతో గరుడపక్షి ఆకారంలో చితి నిర్మాణం చేసి దానిపై ప్రధానయజ్ఞగుండం ఉంచి హోమాలు నిర్వహిస్తామన్నారు.

ప్రజా సేవకుడు నీతిపూడి: ఎమ్మెల్యే

పి.గన్నవరంలో గణపతిరావు విగ్రహావిష్కరణ



పి.గన్నవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కులాలు, మతాలకు అతీతంగా, నిజాయితీకి ఆదర్శంగా నిలిచిన ప్రజాసేవకుడు మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు అని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. పి.గన్నవరం అక్విడెక్ట్ వద్ద మండల అంబేడ్కర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీతిపూడి గణపతిరావు విగ్రహాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అడ్వకేట్ సరేళ్ల ఆనందశాస్త్రి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తొలుత నగరం నుంచి గణపతిరావు తనయుడు గణేష్‌బాబు, ఆయన అభిమానులు పెద్దఎత్తున ఊరేగింపుగా పి.గన్నవరం తరలివచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరిదేవి, కొండేటి చిట్టిబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, కోనసీమ దళిత ఐక్యవేదిక కన్వీనర్ కోట రామ్మోహనరావు, యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, బొండాడ నాగమణి, కొక్కిరి లక్ష్మి, అడ్డగళ్ల వెంకటసాయిరాం, నక్కా వెంకటేశ్వరావు, యన్నపు పెద్ద, చినబాబు, రవికుమార్, యువరాజు, రాజేంద్రప్రసాద్, రఘు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు వెళ్లిన అభిమానులు

మామిడికుదురు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో అభిమానులు తరలివెళ్లారు. నగరం గ్రామంలోని మాజీ సర్పంచ్ నీతిపూడి గణేష్‌బాబు ఇంటి నుంచి భారీగా ద్విచక్ర వాహనాలు, కార్లతో వెళ్లారు. కటకంశెట్టి ఆదిత్య, నెల్లి దుర్గాప్రసాద్, తోరం గౌతమ్, తులా గోపాల కృష్ణ, కడలి శ్రీను, తోలేటి ఆది నారాయణమూర్తి, పహాద్, జాఫర్ అబ్బాస్, అభిమానులు వెళ్లారు.

ఆరోగ్య దినోత్సవం

పి.గన్నవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నాగుల్లంక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అవగాహన సదస్సు కల్పించారు. డాక్టర్ వైవీ ప్రియాంక ఆధ్వర్యంలో ఆరోగ్యంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. డాక్టర్ మహమ్మద్ తున్నిషాబేగం, డాక్టర్ మౌనిక, ఎంపీహెచ్ఈవో ఎ.నాగరాజు, ఎంపీహెచ్ఎస్ బి.వి.వి.ఎస్.ఎన్. మూర్తి, కేసీ హెచ్ మరియమ్మ, ట్రైనీ వైద్యులు, ఆశా కార్యకర్తలుపాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం



చింతలూరు నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం ఇస్తున్న దాతలు

ఆలమూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి గుమ్మిలేరుకు చెందిన ముత్యాల వీర భాస్కరరావు, కృష్ణవేణి దంపతులు రూ. 1,00,116 విరాళంగా ఇచ్చారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం ఈ విరాళం అందజేశారు. సోమవారం వారితోపాటు వారి కుటుంబ సభ్యులు పూజలు చేశారు. ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి, గ్రామస్తుల సమక్షంలో వారు విరాళం అందించారు. విరాళం అందించిన దాత భాస్కరరావును పలువురు అభినందించారు.

విజయదుర్గా పీఠంలో యాదాద్రి కలెక్టర్ పూజలు

రాయవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి కలెక్టర్ కె.హనుమంతరావు సోమవారం సందర్శించారు. విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, హారతులు నిర్వహించారు. పీఠంలో భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి కలెక్టర్ పూజలు చేశారు. పీఠంలో నవగ్రహ, నక్షత్ర హోమంలో ఆయన పూర్ణాహుతి జరిపారు. అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు తీసుకున్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం ప్రతినిధి గాదే భాస్కరనారాయణ యాదాద్రి కలెక్టర్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు బలిజేపల్లి రమ, గాదే సత్యవెంకట కామేశ్వరి, పెదపాటి సత్య కనకదుర్గ, పీఆర్వో బాబి తదితరులు పాల్గొన్నారు.



విజయదుర్గా పీఠంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు

పలివెలలో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పలివెలలో సోమవారం పంచముఖ ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించు కున్నారు. కార్యక్రమంలో చవల జగన్నాథం, కంఠంశెట్టి శ్రీనివాస్, సాదే శ్రీనివాస్, భమిడిపాటి లక్ష్మి నారాయణ, నల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి ఉత్సవాలను విజయవంతం చేయాలి




మాట్లాడుతున్న డీఎస్పీ సుంకర మురళీమోహన్

ఆత్రేయపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను పోలీస్ యంత్రాంగం విజయవంతంగా చేపట్టాలని డీఎస్పీ సుంకర మురళీమోహన్ సూచించారు. సోమవారం రాత్రి మహాలక్ష్మీరాజు కన్వెన్షన్ హాలులో పోలీస్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఐదు సెక్టార్లుగా విభజించి పోలీస్ సిబ్బందికి డ్యూటీలు వేశామన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిఘా నీడలో సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో సీఐ విద్యాసాగర్, ఎస్ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీ వద్ద పోలీస్ పహారా

ఆత్రేయపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో కాటన్ బ్యారేజీ వద్ద స్నానాలు చేయకుండా పోలీసులు పహారా నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. పిచ్చుకలంక వద్ద గోదావరిలో స్నానాలు చేస్తూ పలువురు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. బ్యారేజీ దిగువన పర్యాటకులు స్నానాలు చేయకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఎవరైనా స్నానాలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



బొబ్బర్లంక వద్ద పోలీసుల గస్తీ దృశ్యం



రాయవరం హైస్కూల్‌కు విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రాయవరం హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల విరాళం

రాయవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ. 6లక్షల ను విరాళంగా అందజేశారు. 1975-80 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పాఠశాల హెచ్‌ఎం వి.శాంతి సునీతకు విరాళాన్ని అందజేశారు. పాఠశాల అభివృద్ధికి వారు అందించిన చేయూత అభినందనీయమని ఆమె అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆర్‌వీవీ సత్యనారాయణ చౌదరి, తాడి వెంకట లక్ష్మీనారాయణరెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, పి.సత్యనారాయణరెడ్డి, కె.వెంకటరెడ్డి, ఎం.సూరారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు, పీఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గోడ నిర్మాణాన్ని అడ్డుకున్న ఛైర్మన్, గ్రామస్తులు

రావులపాలెం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి, వేమన కల్చరల్ అసోసియేషన్ కల్యాణ మండపానికి మధ్యలో నిర్మించే గోడను ఛైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి, గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానిక దేవస్థానం, అసోసియేషన్ రెండు కార్యవర్గాలుగా ఉన్నప్పటికి 2009 నుంచి ఇప్పటి వరకు విబేధాలు లేకుండా సాగుతోంది. కాగా గ్రామానికి చెందిన మల్లిడి తిరపారెడ్డి దేవస్థానానికి, కల్యాణ మండపానికి మధ్యలో గోడ నిర్మించాలని పంచాయితీ కార్యదర్శికి ఫిర్యాదు చేసి వత్తిడి తెచ్చారన్నారు. దీంతో సోమవారం గోడ నిర్మాణం చేపట్టేందుకు సామగ్రిని తీసుకుని అక్కడకు చేరుకున్నారు. దీంతో ఛైర్మన్, గ్రామస్తులు అడ్డుకోగా పంచాయతీ అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. మల్లిడి తిరపారెడ్డి అనే వ్యక్తి గ్రామంలో పలువురిపై ఫిర్యాదులు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తుంటాడని ఆరోపిం చారు. దేవస్థానం విషయంలో అతనికి సంబంధం లేకపోయినప్పటికి ఇలా ఫిర్యాదులు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ఆరోపించారు.



రావులపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సమావేశమైన ఛైర్మన్, గ్రామస్తులు



మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న దృశ్యం

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

రావులపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఈతకోట నెక్కంటి కాలనీకి చెందిన ముగ్గురు యువకులు గోపాలపురం ఆరుమామిళ్ల వద్ద స్నానం చేస్తుండగా షేక్ ఖాదర్‌వల్లీ(22) గల్లంతైన సంగతి తెలిసిందే. ఆదివారం పోలీసులు, బంధువులు గాలింపు చేపట్టినా లభ్యం కాలేదు. సోమవారం జరిగిన గాలింపులో ఖాదర్‌వల్లీ మృతదేహం పంట కాల్వలో లభ్యమైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాయుడురాము తెలిపారు.

వెంకన్న ఆదాయం రూ.1.90లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,90,234 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

క్రికెట్ అకాడమీ పేరుతో క్రీడా మైదానం కబ్జా

• విద్యాశాఖ అధికారులపై రాజకీయ నేతల ఒత్తిడి • అసంతృప్తి వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కొత్తపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రైవేట్ క్రికెట్ అకాడమీకి చెందిన వ్యక్తులు అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేస్తూ కబ్జాకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీని కోసం సంబంధిత విద్యాశాఖ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కోనసీమ జిల్లాలోనే అతి పెద్ద క్రీడా మైదానం కలిగి ఉంది. ఇక్కడి క్రీడా మైదానంలో పలువురు విద్యార్థులు క్రీడాకారులుగా తీర్చిదిద్దబడ్డారు. ఇటీవల ఇక్కడి క్రీడా మైదానం కబ్జాలతో కుచించుకుపోతోందని పలు వురు ఆరోపిస్తున్నారు. దీనిపై హైకోర్టులో కేసు నడుస్తుండగా కేకేఆర్ క్రికెట్ అకాడమీ పేరుతో బోర్డు ఏర్పాటు చేసి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. దీన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తు న్న సంబంధిత అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారని పలువురు గ్రామ స్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై హెచ్‌ఎం రంకిరెడ్డి రామకృష్ణను వివరణ కోరగా తాము టెన్త్ పరీక్షలకు వేరేచోట విధులు నిర్వహిస్తుండగా క్రీడా మైదానాన్ని ఆక్రమించారన్నారు. ఇది చట్ట విరుద్ధమని నిర్వాహకులకు తెలియచేసి రెండు రోజుల గడువులో తీసివేయాలని చెప్పామని, అలా కాని పక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ వ్యవహారంపై జిల్లాస్థాయి విద్యాశాఖాధికారులు చొరవ చూపి క్రీడా మైదానం కబ్జా కాకుండా చూడాలని స్థానికులతో పాటు పలువురు క్రీడాభిమానులు కోరుతున్నారు.





ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ అకాడమీ పేరుతో ఏర్పాటైన బోర్డు. పక్క చిత్రంలో అకాడమీ కోసం క్రీడా స్థలాన్ని చదును చేసిన దృశ్యం



కర్ణాటక రాష్ట్రంలోని దేవాలయాలను దర్శించుకున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కర్ణాటక పర్యటనలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక పర్యటనలో భాగంగా మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మిత్రులతో కలిసి సోమవారం పలు దేవాలయాలను దర్శించుకున్నారు. అర్తమూరుకు చెందిన తాడి శేషారెడ్డి కర్ణాటకలో పౌల్ట్రీలను నిర్వహిస్తున్నారు. ఆయన ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే అక్కడకు వెళ్లారు. ఆయన పర్యటనలో భాగంగా గోకర్ణలోని ఆత్మలింగం, మురుడేశ్వరలోని శివదర్శనం, కొల్లూరులో ముకాంబిక దర్శనం చేసుకున్నారు. ఆయన వెంట ఎస్.వీరెడ్డి, సీహెచ్ రామన్నకాపు, టీవీజీ రెడ్డి తదితరులు వున్నారు.



ర్యాలి జగన్మోహిని కేశవస్వామిని దర్శించుకున్న భక్తులు

ర్యాలి కేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారికి నిత్యాపసన, బలిహరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి జాతర కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి ఆయా ఏర్పాట్లు నిర్వహించారు.



మండపేటలో మద్యం దుకాణం ఏర్పాటుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మహిళలు

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

మండపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యశ్రీ రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటును స్థానికులు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని స్థానికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 17వ రోజుకు చేరాయి. ఇప్పటికే వార్డుకు చెందిన ప్రజలు తమ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్, జేసీతోపాటు, స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కాంగ్రెస్ పార్టీనేత కామన ప్రభాకరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాణిలను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులకు తమ ఫిర్యాదులు అందించినప్పటికి ఎటువంటి చర్యలు లేవని వారు ఆరోపిస్తున్నారు. సప్తగిరి థియేటర్ వద్ద కొనసాగుతున్న వారి రిలే నిరాహార దీక్షలకు అన్ని పార్టీలకు చెందిన నేతలు సంఘీభావం తెలిపారు. సోమవారం కాలనీవాసులు అమలాపురంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు కూడా చేశారు. ఇప్పుడు ఏర్పాటు చేసే మద్యం దుకాణాన్ని మరోచోటకు మార్చాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని మున్సిపల్ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ తెలిపారు. మద్యం దుకాణం తొలగించకుంటే మున్ముందు తమ ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కార్పొరేషన్ రుణాల ఎంపికకు ఇంటర్వ్యూలు

కె.గంగవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండలంలో బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు 956 మంది దరఖాస్తు చేసుకోగా 743 మంది హాజరయ్యారు. కాపు కార్పొరేషన్ రుణాలకు 1172 మంది దరఖాస్తు చేసుకోగా 896 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈబీసీ రుణాలకు 31 మంది దరఖాస్తు చేసుకోగా 24 మంది హాజరైనట్టు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపాలరావు ఎన్నిక



రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వుండవిల్లి గోపాలరావు ఎన్నికయ్యారు. సోమవారం రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా బొడ్డు వరాహ నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా గోవర్ధనం మల్లేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎన్‌వీవీ శేషుకుమార్, పీవీఎస్ జానకి, కోశాధికారిగా చింతపల్లి శ్రీనివాసరావు, స్పోర్ట్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా సాదే నారాయణరావు ఎన్నికయ్యారు. మహిళా న్యాయవాదుల ప్రతినిధిగా లకాని పద్మకమలకుమారి ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలో వుండవిల్లి గోపాలరావు 154 ఓట్లకు 137 దక్కించుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన బొడ్డు వరహానరసింహమూర్తి 152 ఓట్లకు 79 దక్కించుకుని 6 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సంయుక్త కార్యదర్శులుగా పోటీపడిన ఎన్‌వీవీ శేషుకుమార్, పీవీఎస్ జానకిలకు సమానంగా 77 ఓట్ల చొప్పున పోలవ డంతో వారిని సంయుక్త కార్యదర్శులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి టి.చలపతి కుమార్ ప్రకటించారు. సీనియర్ న్యాయవాది మల్లిడి హరినాథరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.



కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి రత్నకుమారి



ఆలమూరు మండలం పెదపళ్లలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అంగర పీహెచ్‌సీలో ఆమె ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ రామారావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణ సారధ్యంలో రాజేష్ డయాబెటీస్ సెంటరు రాజమహేంద్రవరం వారు తమ సేవలను అందించారు. శిబిరాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పీఎస్ రాణి ప్రారంభించారు. శిబిరంలో ముందుగా మున్సిపల్ సిబ్బందితోపాటు పట్టణ పోలీసులకు పలు పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో పీఎంపీ సంఘ నాయకుడు బళ్ల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఇరవాడ రవికుమార్, వానపల్లి కనకరాజు, ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిశోర్, కె.శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎంఎస్ఎన్ రెడ్డి, జ్యోతికుమార్, ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, శివప్రసాద్, ఉమ, బాలామణి తదితరులు పాల్గొన్నారు.



జొన్నాడ ఇటుకబట్టీ కార్మికులతో మాట్లాడుతున్న మలేరియా నివారణ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

దోమల వ్యాప్తిని నివారించాలి

ఆలమూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా నివారణ జిల్లా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం జొన్నాడ ఇటుకబట్టీ కార్మికులతో మాట్లాడారు. అనంతరం పెదపళ్ల పీహెచ్‌సీ ఆసుపత్రిని సందర్శించారు. జ్వరాలపై ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిషోర్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కులు, ఎంఎస్ రెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఉమ, సిబ్బందికి ఆయన సూచనలు అందించారు.

వయోజన విద్య సెంటర్ ప్రారంభం

రావులపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రావుపాడులో వెజ్ స్వచ్ఛంద సేవా సంస్థ, లిటర్సీ ఇండియా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వయోజన విద్య సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మట్టా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మూడోదశ పీఎంశ్రీ పాఠశాలలు

రాయవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) తో పాఠశాలల సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమవుతుందని సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు తెలిపారు. సోమవారం రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకం ద్వారా జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏఎంవో మాట్లాడుతూ జిల్లాలో మొదటి, రెండోదశలో 26 పీఎంశ్రీ పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీంబాషా ఆధ్వర్యంలో వాటి పనులను మోనటరింగ్ చేస్తున్నామన్నారు.

త్వరలో 3వ దశ పీఎంశ్రీ పాఠశాలలు: జిల్లాలో త్వరలో మూడోదశ పీఎంశ్రీ పాఠశాలలు ఎంపికకు కసరత్తు సాగుతోందన్నారు. తొలుత 6 నుంచి 9 తరగతి విద్యార్థులకు జరుగుతున్న వార్షిక పరీక్షల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంవో వెంట ఎస్ఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి చిన్ని, హెచ్‌ఎం వి.శాంతి సునీత తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ఉపాధి, ఉద్యోగాల కల్పనకు కృషి
ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం జడ్పీ పాఠశాలలో సోమవారం సీఎం సూర్యఘర్ ఎంయూఎఫ్‌టీబిజ్లి యోజన పథకం, టీడీపీ యువ నాయకుడు బండారు సంజీవ్ ఆధ్వర్యంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్య క్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, బీజేపీ నాయకులు పి.సత్యానందం పాల్గొన్నారు.



వినియోగదారులతో సమావేశం నిర్వహించిన బ్యాంక్ ప్రతినిధులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

మండపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంకుల ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని బ్యాంక్ చీఫ్ సెంట్రల్ మేనేజర్ జతీంద్రమౌర్య అన్నారు. మండపేటలో వున్న బ్యాంకు కార్యాలయంలో సోమవారం ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. దీనికి ఆలమూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి హాజరయ్యారు. ఖాతాదారులకు బ్యాంకులు అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రీజనల్ ఆఫీస్ డిప్యూటీ జోనల్ మేనేజర్ మనోజ్, పీమియర్ బ్రాంచ్ మేనేజర్ ప్రేమ్‌సంగీత, ఆర్.ఉదయ్, శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

మండపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసు కుంటామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.నూకరాణి చెప్పారు. పట్టణంలోని పార్కుల నిర్వహణ తీరుపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాజాబాబుతో కలిసి ఆమె పట్టణంలోని పలు పార్కులను పరిశీలించారు. పార్కులో అపరిశుభ్రతను వారు గుర్తించి సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బూరుగుంట చెరువు వద్ద వున్న వైఎస్ఆర్ పార్కులోని సమస్యలు రెండు రోజుల్లో పరిష్కరించకుంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పార్కులో పాడైన జిమ్ పరికరాలు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ ఏఈ అంజనేయులు తదితరులు వున్నారు.

డిగ్రీ కళాశాలలో వెబినార్

రావులపాలెం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెకేసీ కో-ఆర్డినేటర్ కె.రజినీ, ఇంట్రనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ సుభాషిణి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జాతీయస్థాయి ఇంటలిక్యూవల్ ప్రోపర్టీ రైట్స్ పేటెంట్సు డిజైన్ ఫిల్లింగ్ అంశంపై ఆన్‌లైన్‌లో జాతీయస్థాయి వెబినార్ నిర్వహించారు. దీనికి స్పీకర్‌గా కుమార్‌రాజు పాల్గొన్నారు. రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ప్రోపర్టీ మేనేజ్‌మెంట్ నాగపూర్‌కు చెందిన అధ్యాపకులు ఆన్‌లైన్‌లో పేటెంట్సుకు సంబంధించిన అంశాలపై వివరించారు.



అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశానికి వెళ్లిన సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, కిసాన్‌సెల్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు